సైన్యంలో పనిచేస్తున్నాడు శ్రోత దొరికితే చాలు యుద్ధం గురించే మాట్లాడతాడు. మా నాన్నగారికి తనంటే చాలా అభిమానం.

మరి మీకు? చప్పున అడిగి అలా అడిగినందుకు వెంటనే నాలుక్కరుచుకున్నాడు. ఆమె దాన్ని పట్టించుకున్నట్టు లేదు.

నాకూ ఇష్టమే రేపు వేసవిలో మా వివాహం జరగబోతూంది అదిగాక, ఒకవేళ నాకు వేరే అభిప్రాయం వుందని ఏమాత్రం అనుమానం వచ్చినా రైఫిల్‌తో ముందు నన్ను కాల్చేసి తరువాత తను ఆత్మహత్య చేసేసుకుంటాడు నవ్వింది. ఆ నవ్వులో అల్లరీ చిలిపితనం చోటు చేసుకున్నాయి. కానీ ఎందుకో ఆ తరువాత  విహారి అంత ఫ్రీగా వుండలేక పోయాడు. ఆమె చాలా ఉత్సాహంగా వేస్తున్న ప్రశ్నలకు అతడు అన్యమనస్కంగా జవాబు చెప్పాడు.

మీ అస్థి వ్యవహారాలన్నీ ఎవరు చూస్తూ వుంటారు? అడిగింది.

మా గుమాస్తాలు.

ఆమె విస్మయంగా వాళ్ళు సరిగ్గా చూస్తారా? అంది.

ఏదో చూస్తూ వుంటారు అని అతడు లేచి చేతులు జోడించి వెళ్ళొస్తాను అన్నాడు.

అప్పుడైనా అప్రయత్నంగా అంది. ఆమెవైపు అప్రతిభుడైనట్లు చూశాడు. ఆమె కళ్ళు దించుకుంది అతడు కారు దగ్గరకి వచ్చి డోర్ తీశాడు.

ఆమె అంది మొన్నే చెప్పవలసింది థాంక్స్ మర్చిపోయాను.

దేనికి? ఆశ్చర్యంగా అడిగాడు.

మాకా రోజు చేసిన సాయానికి.

ఆ రోజే చెప్పారుగా!

పక్కింట్లో దొంగలు పడ్డా చాలా మంది పట్టించుకోరు. అటువంటిది మీరు ప్రాణాలకి తెగించి మాకు చాలా సాయం చేశారు. ఆ సెన్సాఫ్ రెస్పాన్సిబిలిటి మనుషులకి ముఖ్యంగా భారతీయులకీ తక్కువ అందుకే మీకు మళ్ళీ ఇంకొకసారి చెప్పాలనుకున్నాను. అదృష్టవశాత్తు మళ్ళీ ఈ రోజు కనపడ్డారు మనుష్యులుగా పుట్టినందుకు ఓ ప్రత్యేకతను సంతరించుకునేవారంటే నాకిష్టం. ఆ లక్ష్యం నెరవేరకపోవచ్చు. కానీ ప్రయత్నం వుండాలిగా వెళ్ళిరండి విహారి బాబూ బై బై.

*　　　*　　　*

సాయంత్రం నాలుగున్నర అయింది.

సునాదమాల బస్‌స్టాపులో నిలబడి వుంది. అరగంటయినా స్కూల్ బస్ రాలేదు. ఆమెలో కంగారు ఎక్కువైంది. ఒకవేళ తన కన్నా ముందే దిగి విష్ణు ఇంటికి వెళ్ళిపోయాడేమో అనుకొని ఇంటి కొచ్చింది.

“అదేమిటమ్మా ఒక్కదానివే వచ్చావే?” అంది బామ్మ. సునాద పాలిపోయిన మొహంతో,

“విష్ణు రాలేదా?” అని అడిగింది.

“రాలేదే?”

ఆమె గిర్రున వెనుదిరిగింది. బామ్మ వెనుకనుంచి “ఎందుకే అంత కంగారు?” అంటూన్నా వినిపించుకోకుండా బస్‌స్టాప్ దగ్గిరకు పరుగెత్తుకు వెళ్ళింది.

అప్పటికే అక్కడ వినీల్ వాళ్ళ అమ్మ వుంది, ఆమె కూడా కంగారు పడుతోంది. సమయం అయిదున్నర కావస్తోంది. మరో పావుగంట చూసి ఇద్దరూ రిక్షాలో స్కూలుకి వెళ్ళారు.

స్కూల్ కాంపౌండ్‌లో పోలీసుల్ని చూడగానే సునాదమాల గుండె ఆగినంత పనయింది.

అక్కడ పదిమంది దాకా పోలీసులున్నారు. అప్పటికే పాతిక మందిదాకా పేరెంట్స్ చేరుకుని వున్నారు. అంతా గోలగోలగావుంది. ప్రిన్సిపాల్ చెపుతున్నది ఎవరూ వినిపించుకోవటం లేదు. ఎవరో తండ్రి గట్టిగా అరుస్తున్నాడు. ఏం జరిగిందని ఆతృతగా అడిగింది సునాద. విషయం తెలిసి ఆమె వంట్లో సత్తువంతా ఒక్కసారిగా పోయినట్టు అనిపించింది. పక్కనున్న రెయిలింగ్ పట్టుకుని బలవంతంగా నిలదొక్కుకుంది.

పొద్దున్న పిల్లల్ని తీసుకుని బయల్దేరిన బస్సు స్కూల్ వరకూ రాలేదు.

ఏమైందో తెలీదు.

వినీల్ తల్లి ఏడుస్తోంది. ఇంట్లో హాలు మధ్యలో అమర్చిన కేక్‌ని, వచ్చిన అతిధుల్ని తల్చుకుని పదేళ్ళ కొడుకు ఏమయ్యాడో తెలియక వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆకలేస్తే ఇంట్లోనే నోరు తెరిచి అడగటానికి సిగ్గుపడేవాడు వాడు. ఆ వయసులోనే రాత్రి తొమ్మిదింటి వరకూ కళ్ళజోడు సర్దుకుంటూ టేబిల్ లైట్ ముందు కూర్చుని చదువుకునేవాడు. ఫస్ట్ మార్కు వచ్చినందుకు టీచరు ఇచ్చిన చాక్లెట్‌ను ఇంటికి తీసుకొచ్చి తల్లికి చూపించనిదే తిననివాడు అయిన ఒక్కగానొక్క కొడుకుని తల్చుకుని ఆవిడ ఏడుస్తూంటే ఓదార్చేవాడే లేకపోయారు. అక్కడ అందరి పరిస్థితి దాదాపు అలాగే వుంది.

* * * *

ముఖ్యమంత్రి టేబిలుమీద ఫోన్ మ్రోగింది. అది ఆయన పర్సనల్ నెంబరు. పి.య్యే సెక్రటరీలకు కాకుండా డైరెక్టుగా అయనకే వెళుతుంది. చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు ఆ నెంబరు.

ఆయన రిసీవర్ ఎత్తి “హల్లో” అన్నాడు.

“ఈ రోజు ప్రొద్దున్న గాడ్ ఫాదర్ స్కూలు బస్ పిల్లల్ని తీసుకువెళుతుంటే దారి మళ్ళించబడింది. ఆ వార్త మీరవకూ వచ్చిందా?”

“ఎవరు మీరు?”

“ఆ బస్సును దారి మళ్ళించిన వాళ్ళం.”

ఆయన నొసలు ముడివడ్డాయి. ఆవేశాన్ని అతి కష్టం మీద అణుచుకుంటూ “ఏం కావాలి మీకు?” అని అడిగాడు.

“ప్రస్తుతం ఆ పిల్లలు మా దగ్గరే ఉన్నారు. అంతమంది పిల్లల్ని ఒకేచోట ఎక్కువ కాలం

ఉంచటం కష్టం. అంతమందికి తిండికూడా ఖర్చే."

ముఖ్యమంత్రికి అర్థమైంది. "ఎంత కావాలి మీకు?" పక్కనున్న బటన్ నొక్కుతూ అడిగాడు. పి.య్యే. పరుగెత్తుకు వచ్చాడు. కాగితం మీద "ట్రాప్ దిస్ ఫోన్" అని వ్రాశాడు. పి.య్యే. అదే వేగంతో వెళ్ళి పోయాడు.

"చెప్పండి. ఎంతకావాలి మీకు?"

"మాకు డబ్బు అవసరంలేదు సి. ఎం."

"మరి?"

"రేపు సాయంత్రంలోగా నువ్వు రాజీనామా చెయ్యాలి. లేకపోతే రేపు సాయంత్రం నుంచీ రోజుకొక పిల్లాడ్ని చంపి అసెంబ్లీ ముందు పారేస్తాం."

ఫోన్ కట్ అయింది.

## 6

ఆ రాత్రి పదింటికి విహారి ఇంటికి రెండువందల గజాల దూరంలో ఉన్న ఆఫీసు ప్రాంగణం హడావుడిగా ఉంది. ఇద్దరు గుమాస్తాలు, మేనేజర్, టైపిస్టు కంగారుగా అటూ యిటూ తిరుగుతూ లెడ్జరు పుస్తకాలు, ఫైళ్ళు లోపలికి తీసుకువెళుతున్నారు.

దాదాపు ఆరుగంటల నుంచీ విహారి ఆ కుర్చీలోంచి లేవలేదు. అతడికి ఆ పని కొత్త అయినా పెద్ద అలసటగా లేదు. నాటకాలు రిహార్సల్స్ వేసేటప్పుడు గంటల తరబడి ఒకేపనిమీద కూర్చోవటం అలవాటే. అయితే, ఇప్పుడు అతడు చేస్తున్నది అతని జీవితంలో అంతకుముందు ఎప్పుడూ చేయనిది.

మొదటిసారి తన ఆస్తి వివరాలు పరిశీలించటం ..... దాదాపు ఆరుగంటలపాటు మొత్తం చదివాక అతడికి ఒక అవగాహన వచ్చింది. ఆ తరువాత లెక్కలు పరిశీలించటం మొదలుపెట్టాడు. లెడ్జర్లు, డే బుక్కులు, ట్రయల్ బాలెన్సులు, బ్యాలెన్స్ షీట్లు - ఒక పద్ధతి ప్రకారం చూసుకుంటూ వచ్చాడు. తెల్లవారు ఝాము వరకూ అలా చూస్తూనే వున్నాడు.

వర్ధనమ్మ తెల్లవారుతుండగా లేచి, కొడుకు ఇంకా అవుట్ హౌస్‌లోనే వున్నాడని గుంగూలీ చెప్పగానే కంగారుగా అక్కడికి వచ్చింది. పుస్తకాల వెనుక విహారి మొహం కనబడటంలేదు. పక్కనే అయిదారు ఖాళీ టీ కప్పులున్నాయి. ఆమెకు ఆ దృశ్యం అపూర్వంగా తోచింది. మొట్టమొదటిసారి కొడుకుని అలా చూడటం!!! ..... ఆమె కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి.

ఈ లోపులో, అఖరి అకౌంటు పుస్తకం నుంచి పెన్సిల్‌తో లెక్క వేసుకుని కూడిన విహారి తలపైకెత్తి అంత ప్రొద్దున్నే తల్లిని అక్కడ చూసి ఆశ్చర్యాన్ని అణచుకుంటూ తిరిగి తన మూడ్‌లోకి వచ్చి, "గత ఒక సంవత్సరంలోనే గౌరవనీయులైన మన మేనేజరుగారు నాలుగు లక్షల ఇరవై అయిదువేలదాకా తినేశారమ్మా" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

అతనే అన్నాడు - "ఇది ఈ సంవత్సరంది. మరి గత పది సంవత్సరాలుగా ఈ విధమైన ఆస్తి ఎంత పోయిందో లెక్క తేలాలంటే నాకు మరొక నెల టైమ్ కావాలి. ఆ సంఖ్య తెలుసుకుంటే బహుశా మనిద్దరి గుండెలూ ఆగిపోవచ్చు."

వర్ధనమ్మ నవ్వి, "గుండె ఆగిపోతే ఆగిపోతుందేమోగానీ, అది ఆస్తి పోయినందువల్ల మాత్రం కాదురా! ఇన్నాళ్ళకి కొడుకు ప్రయోజకుడయ్యాడన్న సంతోషంతో" అంది. ఆమె చెప్పింది నిజమే. కొడుకు తెలివితేటల పట్ల ఆమెకేవిధమైన అనుమానమూ లేదు. నాటకాలలో పడి పాడైపోతున్నాడని బాధ అంతే. ఒక రోజు ఉన్నట్టుండి ఆ కొడుకు రాత్రంతా మేల్కొని ఒక సంవత్సరం అకౌంట్లన్నీ మొత్తం పరిశీలించాడంటె ఆమెకు అంతకన్నా కావల్సింది ఏముంది?

ప్రతీవ్యక్తి ఏదో ఒక వయసులో బాధ్యత గుర్తిస్తాడు. (కొంత మంది జీవితాంతం గుర్తించరు. అది వేరే సంగతి) అలా గుర్తించిన వ్యక్తి క్రమక్రమంగా దానిలో లీనమవుతాడు. అయితే, విహారి ఇలా వున్నట్టుండి ..... పనిలో పడటానికి కారణం ప్రవల్లిక మాట్లాడిన నాలుగయిదు మాటలు, అవి చాలు ..... దీనికి తర్కంలేదు. ఆమె మాటలు అతడి గుండెను సూటిగా తాకాయి. సాధించాలనుకున్నాడు - సాధించాడు.

అతడికి ఈ అనందం గొప్ప సంతృప్తినిచ్చింది. చాలా చిత్రంగా ..... అతనికి ఏమాత్రం అలసట అనిపించలేదు. ఒక రచయిత తన జీవితపు అతి గొప్ప నవల అఖర్లో 'శుభం' వ్రాసేక వేళ్ళు విరుచుకుంటూ నిట్టూరుస్తున్నప్పుడు కలిగే ఆనందానికి ఖరీదు కట్టగలిగే షరాలు ఎవరు? అటువంటి ఆనందం ఆ ప్రత్యూష సమయాన అతడికి కలిగింది ఆ ఆనందాన్ని అతడు ఆ అమ్మాయితో పంచుకోవాలనుకున్నాడు. ఇందులో కూడా చిత్రం ఏమీలేదు ఆ అమ్మాయికి త్వరలో వివాహం జరగబోతూ వుందని తెలుసు. కానీ ఆమెకి తనలో ఈ పరిణామం సంగతి చెప్పడానికి వేరే కారణాలు వుండనవసరంలేదు. ప్రతీ మొగవాడూ స్త్రీ దగ్గర ఏ వయసులోనైనా చిన్నవాడే. చిన్నపిల్లవాడు తరచు అద్దంలో తన మొహాన్ని చూసుకోవాలని అనుకున్నట్టు ప్రతీ పురుషుడు తనకు స్ఫూర్తినిచ్చిన స్త్రీ అభినందన పూర్వకమైన చిరునవ్వులో తన విజయాన్ని చూసుకోవాలనుకుంటాడు.

ఆ సాయంత్రం అతడు ప్రవల్లిక ఆఫీసుకు వెళ్ళాడు.

చాలా చిన్నదైన ఆ గది అందంగా వుంది. ఉడెన్ పానెల్స్, రాక్స్, రెండు ఫోన్లు ..... ఎవరో మనస్తత్వవేత్త అన్నట్టు, గదినిబట్టి అందులో నివసించే మనిషిని అంచనా వేయొచ్చు.

ప్రవల్లిక అతడిని చూసి సంభ్రమంగా ఆహ్వానించింది. క్రితం రాత్రి జరిగింది అతడు చెపుతూంటే ఆమె కళ్ళు అదో విధమైన కాంతితో మెరిశాయి. అతడు చెప్పినదంతా విని ఆమె "కంగ్రాచ్యులేషన్స్. లక్ష పోయినందుకు కాదు - పోబోయే లక్షలు మిగిలినందుకు" అంది.

"ఇదంతా మీరు మొన్న ఒక్కమాట అనటంవల్ల ప్రవల్లికా" అనబోయాడు . కానీ అనలేదు. ఆమె దాన్ని అపార్థం చేసుకోవచ్చు. తను మరో అభిప్రాయంతో అంటున్నాడని అనుకోవచ్చు.
ఎవరో రచయిత అన్నట్టు మనకు ఎంతో గొప్పగా అనిపించిన భావాలు ఇతరులకి 'ఏమీ

అనిపించకపోవచ్చు "నా ఒక్క చిన్నమాటవల్ల నీలో యింత మార్పు వచ్చిందా" అని ఆమె తేలిగ్గా నవ్వుకోవచ్చు.

అతడు లేచి "వెళ్ళొస్తాను" అన్నాడు.

"అప్పుడేనా?" కూర్చోండి. కూల్ డ్రింక్ తీసుకుని వెళుదురుగానీ"

"వద్దు ఎందుకో మీకు ఈ విషయం వెంటనే చెప్పాలనిపించింది. వెళ్ళొస్తాను" అని ఆమె దగ్గిర సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

ఆమె అతడు వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయింది.

ఎందుకో తెలీదుగానీ పచ్చపచ్చటి ఆకుల మధ్యనుంచి మంచులో తడిసిన గులాబి నెమ్మదిగా విచ్చుకున్నట్టు ఆమె పెదవుల మధ్య సన్నటి చిరునవ్వు కదిలింది.

ఆమె ఆహ్లాదుపు మూడ్‌ని చెదర్చటనికా అన్నట్టు ఆ గదిలో ఫోన్ మ్రోగింది. "హల్లో " అంది.

"కోడ్ నెంబురు ప్లీజ్."

ఆమె చెప్పింది. చాలా ముఖ్యమైన, రహస్యమైన విషయాలు చెప్పబోయే ముందు ఈ రకమైన కన్ఫర్మేషన్‌లు చేసుకుంటారు.

"ప్రవల్లికా ..... నేనూ చీఫ్‌ని మాట్లాడుతున్నాను."

"చెప్పండి. సర్."

"మనం చాలా ఇబ్బందిలో పడ్డాం. రాబోయే ఇరవై నాలుగ్గంటల్లో డిపార్ట్‌మెంట్ ఒక కీలకమైన సమస్యని ఎదుర్కోబోతూంది."

"ఏమిటి సర్?"

అతడు వివరించాడు. వింటూంటే చేయి అప్రయత్నంగా రిసీవర్‌మీద బిగుసుకుంది. మైగాడ్ ..... మైగాడ్ ..... అనుకుంది మనసులో.

సి.బి.ఐ. చీఫ్ చెప్పుతున్న ప్రతీ వాక్యమూ అతడి చేతికున్న తాయెత్తు తాలూకు మైక్రోఫోన్‌లో వింటున్న అనంతానంతస్వామి పెదవుల మీద చిరునవ్వు కదలాడుతోంది.

*　　*　　*

ముఖ్యమంత్రి రాజీనామా కోసం బస్ హైజాక్ ప్రమాదం అంచున పసిపిల్లలు.

రకరకాల హెడ్డింగ్‌లతో పేపర్లు వచ్చాయి. ఈవెనింగు ఎడిషన్లు అత్యధిక సంఖ్యలో అమ్ముడుపోయాయి. రాష్ట్రంలో ఏ మూల చూసినా ఇదే చర్చ. సంపాదకీయాలు వ్రాయబడ్డాయి.

"అత్యధిక మెజారిటీలో నెగ్గిన ముఖ్యమంత్రి ఈ విధమైన జెదిరింపులకు లొంగటం భావ్యమేనా?"

"టెర్రరిజం Vs ప్రజాస్వామ్యం"